క్లుప్తంగా

గజవాహనంపై వేంకటేశ్వరుని వైభవం


బుగ్గ వేంకటేశ్వరస్వామి

సంజామల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం మండల పరిధిలోని బుగ్గ వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా శుక్రవారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని అర్చకుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు.

రాయితీపై సోలార్ ప్యానల్స్


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఈఈ

బనగానపల్లె రూరల్: పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద అందే రాయితీలను ప్రజలకు తెలియజేసి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కమలాకర్‌రావు అన్నారు. గురువారం స్థానిక పొదుపు భవనంలో విద్యుత్‌శాఖ పథకంపై విద్యుత్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకోవడం వల్ల సబ్సిడీతో పాటు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసి డబ్బు చెల్లిస్తుందని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

కొలిమిగుండ్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కడపకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కడపలో విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్యను కొలిమిగుండ్ల ప్రిన్సిపాల్‌గా నియమించారు. గురువారం ఆయన కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. ఇంటర్మీడియెట్‌లో మంచి ఫలితాలు సాధించేందుకు అధ్యాపక బృందంతో కలిసి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎస్టీఓకు సన్మానం


ఎస్టీఓను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

కోవెలకుంట్ల: స్థానిక సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న నరేష్‌కు గురువారం రిటైర్డ్ ఉద్యోగులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాలుగేళ్లపాటు ఎస్టీఓగా పనిచేసి సాధారణ బదిలీల్లో వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు బదిలీ కావడంతో కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం జీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ చూడామణి ఆయన్ను సత్కరించి వీడ్కోలు పలికారు.

బాధ్యతల స్వీకరణ

డోన్ టౌన్: డోన్ వ్యవసాయ మార్కెట్ అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోడుమూరు వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా ఆ శాఖ డోన్‌కు బదిలీ చేసింది. వ్యవసాయ మార్కెట్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఏఓగా బాధ్యతలు

కోవెలకుంట్ల: మండల వ్యవసాయాధికారిగా సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇది వరకు ఇక్కడ పనిచేస్తున్న నిరంజన్ సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ శిక్షణా కేంద్రానికి వెళ్లారు. ఆ స్థానంలో సంజామల ఏఓగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు.

యోగాతో మానసిక రుగ్మతలు దూరం

డోన్: మానసిక రుగ్మతలకు యోగా దివ్య ఔషధంగా పనిచేస్తుందని గీతా యోగాసన సంఘం అధ్యక్షుడు గురూజీ రాంపుల్లయ్య అన్నారు. స్థానిక కేవీఎస్ పార్కులోని గీతా యోగాసన సంఘం నూతన భవనంలో 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి, శాంతి హోమాలు చేశారు. మానసిక ఒత్తిళ్ల నుంచి దూరం చేసి మనిషిలో ఏకాగ్రత పెంచేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నాగభూషణంరెడ్డి, బచ్చు సురేష్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి బెంగళూరు నగరానికి చెందిన మద్దన్న శ్రీనివాసులు, పార్వతి కుటుంబ సభ్యులు రూ.25 వేల విరాళాన్ని అందజేసినట్లు అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు అర్చకులు దాత కుటుంబ సభ్యులను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదం అందజేశారు.

ప్రభుత్వ బడి.. సమస్యల ఒడి

- తెరుచుకున్న పాఠశాలలు
- విద్యార్థులకు సమస్యల స్వాగతం
- తొలిరోజు అరకొరగా హాజరు
- డీఎస్సీ, బదిలీల ప్రక్రియలో ఎస్జీటీ ఉపాధ్యాయులు


బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల దుస్థితి


బేతంచెర్ల మెయిన్ పాఠశాలలో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

బనగానపల్లె రూరల్: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైన తొలి రోజే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. అరకొరగా విద్యార్థులు హాజరయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు, తగినంత బెంచీలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను సాక్షి బృందం పరిశీలించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. బనగానపల్లె మండలంలో మొత్తం ఎంపీపీ పాఠశాలలు 64, ఉన్నత పాఠశాలలు 12 ఉండగా కొత్తగా ఈ ఏడాది యనకండ్ల, రామక్రిష్టాపురం గ్రామాల్లో ఉన్నత పాఠశాలలను ప్రారంభించారు. 80 శాతం మందికి ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయగా షూస్ మాత్రం అందజేయలేదు. పలు పాఠశాలలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచి పోయింది. మినరల్ వాటర్ ప్లాంట్ కూడా నిరుపయోగా మారింది. పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులకు తగినన్ని బెంచీలు లేవు. ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ కారణంగా చాలా గ్రామాల్లో అరకొరగానే ఉపాధ్యాయులు హాజరయ్యారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో రెండు ఫౌండేషన్ పాఠశాలలు, 16 బేసిక్ ప్రైమరీ పాఠశాలలు, 9 మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత, ఏడు ఉన్నత్, ఒక గురుకుల పాఠశాలలున్నాయి. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం 75 మంది విద్యార్థులున్నారు. వీరిలో 12 మంది పదో తరగతి పూర్తిచేసుకున్నారు. హైస్కూల్ స్థాయిలో 75 మందికి పైగా విద్యార్థులు ఉంటేనే హెచ్‌ఎం పోస్టు మంజూరవుతుంది. పాఠశాలలో ఆ సంఖ్య కంటే తక్కువ మంది ఉండడంతో ఈ విద్యాసంవత్సరం హెచ్‌ఎం పోస్టును నియమించలేదు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 468 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా తొలి రోజు 100 మంది మాత్రమే వచ్చారు. పట్టణంలోని వివిధ పాఠశాలలను డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగ్, యూనిఫాం, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

డోన్ టౌన్: డోన్‌లో మొదటి రోజు విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదైంది. తరగతికి నలుగురు నుంచి ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వం ప్రకటించిన విద్యాసామగ్రి విద్యార్థులకు అందలేదు. షూస్, సాక్సులు మండల కేంద్రానికి ఇంకా చేరలేదు.

సంజామల: మొదటి రోజు స్కూల్ రావడానికి విద్యార్థులు ఆసక్తి చూపలేదు. మండలంలో 42 పాఠశాలలు ఉన్నాయి. 3017 మంది విద్యార్థులు ఉండగా కేవలం వెయ్యి మంది మాత్రమే హాజరయ్యారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని ఎంఈఓ ఈశ్వరయ్య తెలిపారు.

తొలిరోజే అస్తవ్యస్తం

కొలిమిగుండ్ల: మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాడు-నేడు పనులు 75 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయాయి. విద్యార్థులకు గదులు, టాయ్‌లెట్ల సమస్య ఏర్పడింది. మీర్జాపురం ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరంలోనే ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లి పోయాడు. ఆయన స్థానంలో ఎవరూ రాకపోవడంతో పోస్టు ఖాళీ ఏర్పడింది. పాఠశాల తెరిచిన మొదటి రోజు ఉపాధ్యాయుడు లేకపోవడంతో తరగతి గది ఖాళీగా ఉండిపోయింది. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను డిపెప్ పాఠశాలకు పంపించారు. మొత్తం 3798 మంది విద్యార్థులు ఉండగా 2987 మంది విద్యార్థులు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలను మూడు విభాగాలుగా విభజించడంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడే అవకాశముందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పాఠశాలలకు అందించగా కొన్ని పాఠశాలలకు యూనిఫారం అందలేదు.



బెలుం ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా మిగిలిన అదనపు తరగతి గదులు, టాయ్‌లెట్లు

అవుకులో మూలన్నపడ్డ ఆర్‌ఓ ప్లాంట్

అవుకు: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటికి ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ మూలన పడింది. విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. చేసేదేమిలేక పక్కనే ఉన్న సాధారణ నీటిని తాగి దాహం తీర్చుకున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు ఉండడంతో సౌకర్యాలపై ఎవరూ పట్టించుకోలేదు. గతంలో పాఠశాలలు ప్రారంభానికి ముందే అన్ని వసతులను పరిశీలించి, సమస్యలున్న చోట పరిష్కరించేవారు. ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించలేదు. వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అరకొరగా హాజరు

బేతంచెర్ల: పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో 364 మంది విద్యార్థులకు గాను 150 మంది మాత్రమే హాజరయ్యారు. మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయలేదు. ధరణి టౌన్ షిప్పులోని జెడ్పీ హైస్కూల్లో 549 మంది విద్యార్థులకు గాను 116 మంది, ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్లో 295 మందికి గాను 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కానుక వచ్చినా షూస్ మాత్రం రాలేదు. రంగాపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వర్షపు నిల్వ చేరడంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకునే వారు కరువయ్యారు.


ఆకుమల్ల ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న గది


డోన్‌లో అరకొరగా హాజరైన విద్యార్థులు


రంగాపురం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు


బేతంచెర్ల: ధరణి టౌన్ షిప్పులోని జెడ్పీ హైస్కూల్‌లో పూర్తికాని అదనపు తరగతి గదులు


కోవెలకుంట్ల: పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి

బదిలీ అయినా పాత పాఠశాలలే !

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బదిలీల్లో చాలా మంది తమకు అనుకూలంగా ఉండే పాఠశాలలను ఎంచుకున్నారు. విద్యాశాఖ అధికారుల నుంచి బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు. కానీ బదిలీ అయిన వారి స్థానంలో మరో ఉపాధ్యాయుడు వచ్చే వరకు పాత పాఠశాలల్లోనే విధులు నిర్వహించాల్సి రావడంతో ఉపాధ్యాయులు అసంతృప్తిగా ఉన్నారు. ప్రధానంగా ఈసమస్య ఏకోపాధ్యాయ పాఠశాలల్లో నెలకొంది. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల పరిస్థితి సైతం ఇలాగే ఉంది. బదిలీలు ఇంకా రెండు రోజుల పాటు జరగనున్నాయి. కౌన్సెలింగ్‌లో ఎవరూ ఆ స్థానాలు కోరుకోకపోతే డీఎస్సీలో పోస్టులు భర్తీ చేసే వరకు పాత పాఠశాలల్లోనే ఉండాల్సి రావడంతో ఉపాధ్యాయులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బదిలీలు జరగడంతో ఉపాధ్యాయులు సంతోషపడినా చివరకు ట్విస్ట్ పెట్టడంతో అయోమయంలో ఉన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు మాత్రం బదిలీల్లో భాగంగా ఆయా పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. కౌన్సెలింగ్‌లో ఎవరూ రాకపోతే తమ పరిస్థితి ఏంటని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన ఇల్లు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో పాణ్యం మద్దిలేటి స్వామి, వెంకటలక్ష్మమ్మ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డోన్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.1.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.

కోవెలకుంట్లలో 20 మి.మీ వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. కోవెలకుంట్ల మండలంలో అత్యధికంగా 20 మి.మీ, ఉయ్యాలవాడలో 14.8 మి.మీ, సంజామలలో 5.2 మి.మీ, దొర్నిపాడులో 3.8 మి.మీ, కొలిమిగుండ్లలో 3.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. వివిధ పంటలు మొలక దశలో ఉండగా వర్షం పడటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

డోన్‌లో 23.4 మీ.మీ వర్షం

డోన్ టౌన్: మండలంలో 23.4 మీ.మీ వర్షం కురిసినట్లు సహాయ గణాంక అధికారి మునిస్వామి తెలిపారు. సబ్ డివిజన్‌లోని ప్యాపిలి మండలంలో అత్యధికంగా 54.8 మి.మీ, బనగానపల్లెలో 18.2, కొవెలకుంట్ల 20, అవుకులో 1.4, బేతంచెర్లలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. వెంకటాపురం తుమ్మల చెరువుకు కొంత మేర నీరుచేరింది.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

సంజామల: ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ అనీల్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదుల వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ తులసికృష్ణ పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోవెలకుంట్ల: పట్టణంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ ఆధ్వర్యంలో మూడేళ్లు నిండిన చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పూర్వ ప్రాథమిక విద్య ద్వారా సంసిద్ధుల్ని చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, అరుణ, జయమ్మ, శివనాగలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణమూర్తి(65) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారితో పాటు గిడ్డంగులశాఖ, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ల మాజీ డైరక్టర్లు బాబుల్ రెడ్డి, ముర్తుజావలి, ఖాజహుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: అదనపు కట్నం తేవాలని భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని భార్య పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. పట్టణంలోని వడ్డేపేట కాలనీకి చెందిన చంద్రకళను అదే కాలనీకి చెందిన సంపంగి రాజేష్‌కు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం చేశారు. అప్పట్లో కట్నకానుకల కింద రూ.1.50 లక్షల నగదు, ఐదు తులాల బంగారం పెట్టారు. అయితే చెడు అలవాట్లకు బానిసైన తన భర్త అదనపు కట్నం తేవాలంటూ అత్త దేవి, మరిది రాజ్ కుమార్‌తో కలిసి వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు చంద్రకళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాలు గురువారం వెల్లడించారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల-నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని కుందూనది వంతెన సమీపంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

మహిళపై దాడి

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతపేట ఏడుకొప్పెర్ల బావి సమీపంలో మహిళపై గుర్తు తెలియని వ్యక్తి గురువారం దాడి చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాలనీలో నివాసం ఉంటున్న మల్లమ్మ ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా ఓ వ్యక్తి కర్రతో దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. బాధితురాలి కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీజేపీ నుంచి మహరాజ్ బహిష్కరణ

డోన్: బీజేపీ డోన్ నియోజవర్గ మాజీ కన్వీనర్ వడ్డె మహరాజ్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియమావళిని అనేక సార్లు అతిక్రమించి అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో ఆయనపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. బెల్టు షాపునకు అనుమతి ఇప్పిస్తామని నగదు వసూలు చేయడం, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సందు వెంకటరమణపై దాడికి ప్రయత్నించారనే ఆరోపణలు రావడంతో రాష్ట్ర నాయకత్వం వేటు వేసినట్లు తెలిపారు. కాగా తనపై పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేసి బయటకు పంపించేశారని మహరాజ్ పేర్కొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా వివిధ పంటల్లో రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, సుధాకర్, ఆదినారాయణ సూచించారు. గురువారం భీమునిపాడు, కంపమల్ల గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రం, బనగానపల్లె మండలం యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్తలు హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పత్తి, వరి, మిరప, మొక్కజొన్న, మినుము, పెసర, కంది, తదితర పంటల్లో విత్తనం మొదలుకుని దిగుబడులు చేతికందే వరకు సలహాలు పాటించాలన్నారు.

విమర్శలు మాని అభివృద్ధి చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: టీడీపీ నాయకులు విమర్శలు మాని అభివృద్ధి చేస్తే బాగుంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీ కృష్ణ, నాయకులు వెంకటేశ్వర్లు, నాగరాజు, యాకోబ్ అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతనైతే పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులను ఆదుకోవాలని.. అంతేకాని అధికారంలో లేని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై విమర్శలు చేస్తే సహించమన్నారు. టీడీపీ నేతలు పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీకి తాళం వేయించి ధర్నా చేయడం చేతగానితనానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిందంటే పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు కష్టాలు తప్పవని తెలిపారు. 1999లో టీడీపీ హయాంలో మూతబడిన ఫ్యాక్టరీని తిరిగి 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో పునఃప్రారంభించారని గుర్తు చేశారు. మళ్లీ 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే మూతపడిందన్నారు. మాజీ మంత్రి బుగ్గన 2019లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మళ్లీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ సిమెంట్ ఫ్యాక్టరీని సాగర్ సిమెంట్ యాజమాన్యం పునఃప్రారంభించే క్రమంలో పాత మిషనరీని తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేసింది తప్ప, ఈ విషయంలో మాజీ మంత్రి బుగ్గనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నీచ రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. దమ్ము ధైర్యం ఉంటే ఫ్యాక్టరీని తిరిగి తెరిపించుకోవాలే తప్ప తప్పుడు ఆరోపణలు దేనికని పేర్కొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు ఛిద్రం


మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణశాఖ అధికారి శ్రీనివాస్

డోన్: బాల్యవివాహాలతో పిల్లల బంగారు భవిష్యత్తు ఛిద్రమవుతుందని జిల్లా బాలల సంరక్షణశాఖ ముఖ్య అధికారి శ్రీనివాస్, సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై మండల స్థాయి సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిరక్షరాస్యులైన వారిని చైతన్యపరిచి 18 ఏళ్లలోపు ఉన్న బాలికలకు వివాహాలు చేస్తే ఎదురయ్యే మానసిక, శారీరక, ఆరోగ్య సమస్యల గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. కొందరు బాలికలను మధ్యలోనే చదువు మాన్పించి పెళ్లిళ్లు చేస్తున్నారని.. ఇలా చేయడం వల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటుందని తెలిపారు. ఇది చట్టరీత్యా నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ ప్రతి నెలా 1వ శుక్రవారం, 3వ శుక్రవారం సమావేశం జరిపి ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నాయనే విషయాలను ఆరా తీయాలన్నారు. బాల్య వివాహాలు చేసే వారి గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు హెల్ప్‌లైన్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

రీసర్వే పనులను వేగవంతం చేయండి


సమావేశంలో జిల్లా సర్వే అధికారి జయరాజ్

డోన్ టౌన్: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రీసర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా సర్వే అధికారి జయరాజ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రీసర్వే పనులపై గ్రామ సచివాలయం సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం డోన్ మండలంలోని ఉడుములపాడు, యాపదిన్నె గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం నాణ్యతగా సర్వే చేపట్టాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని.. సొంత నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. పూర్తి చేసిన సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సమావేశంలో డీటీ తహసీల్దార్ సునీల్‌రాజా, మండల సర్వేయర్ జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


నొస్సంలో బండ లాగుతున్న వృషభాలు

సంజామల: బుగ్గ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నొస్సం గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. రెండు పండ్ల విభాగానికి చెందిన 18 వృషభాలు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా రోళ్లపాడుకు చెందిన ప్రభాకర్ రెడ్డి వృషభాలు 4239 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేలు గెలుపొందాయి. రెండో స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసులు ఎడ్లు 3782 అడుగులు, అదే జిల్లా ముడ్డపాడు చెందిన తనీష్ కుమార్ జత 3750 అడుగులు, నొస్సంకు చెందిన హరినాథ్ రెడ్డి ఎడ్లు 3547 అడుగులు, నంద్యాల జిల్లా పెసరాయికి చెందిన నాగేశ్వర్ రావు ఎడ్లు 3447 అడుగులు, వైఎస్సార్ జిల్లాకు చెందిన హేమలత రెడ్డి వృషభాలు 3421 అడుగులు లాగాయి. వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుపొందాయి. నిర్వాహకులు గాధంశెట్టి వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, చిరంజీవి బహుమతులు అందజేశారు.